రెచ్చిపోయిన వైసీపీ ఇసుకాసురులు

- అక్రమ రవాణాను అడ్డుకున్న రైతును చితకబాదారు
- ప్రశ్నించిన మహిళలకు చంపేస్తామంటూ బెదిరింపు



తలకు తగిలిన గాయాన్ని పోలీసులకు చూపిస్తున్న రైతు



కాలప్పపై దాడి చేస్తున్న ట్రాక్టర్ యజమానులు

పిచ్చాటూరు, మార్చి 31: రాత్రీపగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో స్థానికులతో కలిసి ఓ రైతు అడ్డుకున్నాడు. ఇంకేముంది వైసీపీ ఇసుకాసురులు రెచ్చిపోయారు. ఆ రైతును చితకబాదారు. ఈ సంఘటన పిచ్చాటూరు మండలంలోని పులికుండ్రం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అరుణానది పరివాహక ప్రాంతం నుంచి వేలూరు మార్గంలో పులికుండ్రం మీదుగా నారాయణవనం, పుత్తూరుకు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఎలాంటి అనుమతి లేకుండా అధికార పార్టీ నేతలు తరలించేస్తున్నారు. రాత్రిపూట అయితే ఇంకా ఎక్కువ సంఖ్యలో ట్రాక్టర్లను తిప్పుతున్నారు. వీటి వల్ల వస్తున్న శబ్దంతో పులికుండ్రం గ్రామస్తులకు నిద్ర ఉండటం లేదు. పైగా రోడ్డుకు సమీపంలోనే ఇళ్లు ఉండటంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలో ఉన్నారు.ఈ క్రమంలో ఆదివారం వేకువ జామున గ్రామానికి చెందిన కాలప్ప అనే రైతు స్థానికులతో కలిసి ట్రాక్టర్లను అడ్డుకున్నాడు. దీనిపై ఆగ్రహించిన వెంగళత్తూరు సర్పంచ్ అన్నాదొరై (వైసీపీ) తన ట్రాక్టర్ డ్రైవర్, మరికొందరితో కలసి కాలప్పను చితకబాదాడు. ఇనుప రాడ్డుతో తలపై కొట్టి గాయపరిచారు. ఇదేమి అన్యాయమని స్థానిక మహిళలు ప్రశ్నిస్తే.. 'పిచ్చాటూరుకు వెళ్లాలంటే వెంగళత్తూరు మీదనే వెళ్లాలి.. వెంగళత్తూరులో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరినీ చంపేస్తాం' అని వైసీపీ ఇసుకాసురులు బెదిరించారు. దీంతో గ్రామపెద్దలు కల్పించుకుని సర్ది చెప్పి.. బాధితుడి గాయానికి చికిత్స చేయించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై ఎస్ఐ వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు.



అట్టకానితిప్ప చెరువు కట్టను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

'కోడ్' కూశాక అభివృద్ధి పనులా?

- అధికార పార్టీ నాయకుల తీరుపై గ్రామస్తుల అభ్యంతరం
- పనులను ఆపించిన అధికారులు

సూళ్లూరుపేట, మార్చి 31: ఎన్నికల కోడ్ కూసినా కొందరు అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తూ ఓటర్లకు ఎరవేస్తున్నారు. ఇటువంటిదే సూళ్లూరుపేట మండలం అట్టకానితిప్ప గ్రామంలో జరిగింది. గ్రామంలోని చెరువు పొర్లుకట్టల పనులను అధికార పార్టీ నేతలు ఆదివారం చేపట్టి.. హడావిడి చేశారు. వాస్తవానికి టెండర్లు దక్కించుకొన్న కాంట్రాక్టర్.. ఆ పనులను అధికార పార్టీ నాయకులకు ఇచ్చేశారు. ఇన్నాళ్లూ మౌనంగా ఉండిన గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు ఇపుడు పనులు ప్రారంభించారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి ఈ పనులను నిలుపుదల చేయించారు.

రూ.కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

- పట్టీపట్టనట్లు రెవెన్యూ శాఖ



కుర్రకాలువ పాకశాస్త్ర విశ్వవిద్యాలయం ఎదురుగా ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లు

రేణిగుంట, మార్చి 31: కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా రెవెన్యూశాఖ పట్టీపట్టనట్లు ఉంటోందని స్థానికులు విమర్శిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. రేణిగుంట మండలం కుర్రకాలువ లెక్క దాఖలాలో సర్వే నెంబరు 112/1, 2, 3లో నాలుగున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వ అవసరాలకు గతంలో రిజర్వుచేసిన ఈ భూమిలో ప్రైవేటు వెంచర్‌ను తలపించేలా రోడ్లు వేసి.. చిన్న చిన్న ఇళ్లను నిర్మించి మరీ విక్రయించేస్తున్నారు. గతంలో ఇదే భూమిలో నిర్మాణాలు చేపడితే రెవెన్యూశాఖ తూతూ మంత్రంగా రెండు ఇళ్లను కూల్చి చేతులు దులుపుకుంది. ప్రస్తుతం యథేచ్ఛగా చిన్నపాటి ఇళ్లను నిర్మించి అమ్ముకుంటున్నారు. దీనివెనుక వేరే పంచాయతీ పరిధిలోని ఇద్దరు సర్పంచులు ఉన్నట్లు సమాచారం. వీరు తమ పేరు బయటపడకుండా తిరుపతికి చెందిన ఓ దళిత నేతను ముందుపెట్టి పని కానిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనిలోపనిగా.. పెట్టుబడి పెడితే చాలు అంతా తాము చూసుకుంటామని.. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న విలువైన ప్రభుత్వ భూములను రాత్రికి రాత్రే వీరు కబ్జా చేస్తున్నారని వాపోయారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూశాఖ పట్టించుకోక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో పాకశాస్త్ర విశ్వవిద్యాలయం, టీసీఎల్, మరెన్నో పరిశ్రమలు రావడంతో భూముల విలువ అమాంతంగా పెరిగిపోయింది. అందువల్ల కలెక్టర్ స్పందించి.. విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాల్సి ఉంది.

చంద్రబాబుకు ఘన వీడ్కోలు



చంద్రబాబు నుదుటన బొట్టు పెడుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 31: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు శ్రీకాళహస్తిలో ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలో శనివారం జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు టీడీపీ అధినేత విచ్చేసిన విషయం తెలిసిందే. సభ అనంతరం ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద బస చేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబును కలిసి వీడ్కోలు పలికేందుకు ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచే పెద్ద సంఖ్యలో టీడీపీ, బీజేపీ జనసేన, నేతలు కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి పాదాల చెంత శ్రీచక్రంపై అర్చించిన కుంకుమను, ముక్కంటి ఆలయ తీర్థ ప్రసాదాలను చంద్రబాబుకు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అందజేశారు. అనంతరం బొజ్జలతో అధినేత ఏకాంతంగా చర్చలు జరిపారు. తర్వాత మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత దంపతులు చంద్రబాబును కలిసి శేష వస్త్రంతో సత్కరించారు. అలాగే తన కారవాన్ నుంచి మాజీ సీఎం వెలుపలకు రాగానే పలువురు నాయకులు ఘనంగా సత్కరించి, దేవతామూర్తుల చిత్రపటాలను బహూకరించారు. ఉదయం 10.31 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి చంద్రబాబు కాన్వాయ్ బయల్దేరింది. ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలోని హెలిప్యాడ్ చేరుకుని 10.41 ప్రాంతంలో హెలికాప్టర్‌లో కర్నూలు జిల్లా పర్యటనకు వెళ్లారు.

జూదమాడుతూ పట్టుబడ్డ కానిస్టేబుల్ సస్పెన్షన్

తిరుపతి క్రైం, మార్చి 31: జూదమాడుతూ పట్టుబడ్డ కానిస్టేబుల్ పూర్ణచంద్రరావును సస్పెండ్ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి రూరల్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పూర్ణచంద్రరావు చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలంలోని కొల్లాగుంట మామిడి తోపులో కొందరితో కలసి ఇటీవల జూదం ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో కానిస్టేబుల్‌పై ఎస్పీ శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

రేపటినుంచి ముత్యాలమ్మ జాతర

- తూర్పు కనుపూరులో ఏర్పాట్లు పూర్తి: ఈవో



నవీన్‌కుమార్

చిల్లకూరు, మార్చి 31: చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ జాతర.. మంగళవారం నుంచి ఈనెల ఐదో తేదీవరకు జరుగుతుందని ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఆదివారం అమ్మవారి ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జాతరకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు జాతరకు తరలివస్తారన్నారు. వీరందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో అర్చకులు శివయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

11 మంది వలంటీర్ల సస్పెన్షన్ : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 31: ఎన్నికల నియమావళిని అతిక్రమించిన 11మంది వలంటీర్లను ఆదివారం నాటికి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వీరిలో.. ఏర్పేడులో నలుగురు, నారాయణవనంలో ముగ్గురు, బీఎన్‌కండ్రిగలో ఇద్దరు, రేణిగుంట, పుత్తూరులో ఒకరు చొప్పున ఉన్నారన్నారు. వీరంతా ప్రభుత్వం ఇచ్చిన పరికరాలను (మొబైల్, ట్యాబ్ తదితరాలు) కలెక్టరేట్‌లో అందజేయాలని ఆదేశించారు.

నేటినుంచి 'టెన్త్' మూల్యాంకనం

తిరుపతి(విద్య), మార్చి 31: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. 8 రోజుల పాటు తిరుచానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంగా జరగనుంది. 7 పేపర్లకు సంబంధించి 24 పేజీల బుక్‌లెట్‌లతో కూడిన 1.80 లక్షల తెలుగు, ఆంగ్ల మీడియం పేపర్లను మూల్యాంకనం చేయనున్నారు. 900 మంది ఉపాధ్యాయులు ఈ ప్రక్రియలో పాల్గొంటారు. జిల్లాకు క్యాంప్ ఆఫీసర్‌గా డీఈవో డాక్టర్ వి.శేఖర్ వ్యవహరిస్తారు. మరో 10 మంది సీనియర్ ప్రధానోపాధ్యాయులను అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లుగా నియమించారు. మూల్యాంకనానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో తెలిపారు.

ఎస్వీయూ లా విభాగానికి ఆరుగురు గౌరవాచార్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 31: ఎస్వీ యూనివర్సిటీ లా విభాగంలో ఆరుగురు గౌరవ ఆచార్యుల నియామకానికి మార్గం సుగమమైంది. లా విభాగం పరిధిలో నిర్వహించే బీఏ ఎల్ఎల్‌బీ కోర్సు విద్యార్థులకు అవసరమైన బోధన, మార్గదర్శకత్వం, కోర్సు అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు, గుర్తింపునకు వీరు తోడ్పడే అవకాశం ఉంటుంది. వేతన రహిత సేవలు అందించడానికి వారు సుముఖత వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన బీఏ ఎల్ఎల్‌బీ దశమ వార్షికోత్సవాల సందర్భంగా ఈ విషయాన్ని చర్చించినట్లు సమాచారం. నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ వైఆర్ హరగోపాల్‌రెడ్డి, చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ మాజీ వీసీ ఎ.లక్ష్మీనాథ్, గోవాలోని ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వీసీ ఆర్.వెంకటరావు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు, సుప్రీంకోర్టు డిసిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది మహాలక్ష్మి పావని, ఢిల్లీ లా యూనివర్సిటీ వ్యవస్థాపక వీసీ రణధీర్‌సింగ్‌లను నియమించాలని భావిస్తున్నారు.



తిరునగరిలో శ్రద్ధాదాస్ సందడి

సినీ నటి శ్రద్ధాదాస్ తిరుపతిలో సందడి చేశారు. 'పారిజాతపర్వం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం చిత్ర నటీనటులతో కలిసి నగరానికి వచ్చారు.

వైసీపీ అభ్యర్థికి నిరసన సెగ



రాజేష్‌ని అడ్డుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- మాదిగపల్లెలో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్న ఎమ్మార్పీఎస్

సత్యవేడు, మార్చి 31: సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌కి నిరసన సెగ తగిలింది. సత్యవేడు మండలం మాధనపాళెంలో ఆదివారం ప్రచారానికి వెళ్లిన ఆయన్ను ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిపట్టు రాఘవయ్య మాదిగ ఆధ్వర్యంలో నాయకులు నిలదీశారు. మాదిగలకు అన్యాయం చేసిన వైసీపీకి మాదిగపల్లెలో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. పైగా తమ సమస్యలను ఏనాడూ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. అటువంటిది ఇప్పుడు ఓట్లు అడిగేందుకు ఎలా వచ్చారని ప్రశ్నించారు. తమ చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రం నుంచి కనీసం లాయర్‌ని కూడా నియమించని జగన్ ప్రభుత్వానికి ఓటు హక్కుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మాదిగపల్లెలోకి వైసీపీ నాయకులను రానివ్వకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ధనరాజు మాదిగ, వెంకటేష్ మాదిగ, మునిబాబు మాదిగ, ముని ప్రశాంత్ మాదిగ, నాగేంద్ర మాదిగ, మునస్వామి మాదిగ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : సా. 6.27
సహరి (మంగళవారం) : ఉ. 4.49

ఇవేం కక్కుర్తి పనులు..?



- 'ముక్కంటి' నిధులతో నాసిరకం నిర్మాణాలు
- నెల రోజులకే కుంగిపోయిన షెడ్ ఫ్లోరింగ్

శ్రీకాళహస్తి, మార్చి 31: ముక్కంటి ఆలయ ఇంజనీరింగ్ అధికారుల తీరు మారడం లేదు. కమీషన్ల కక్కుర్తితో నాసిరకం నిర్మాణాలను సాగిస్తూనే ఉన్నారు. నెల రోజుల క్రితం అనవసరమైన ప్రదేశంలో భక్తుల బస సాకును చూపుతూ ఆగమేఘాలపై షెడ్ నిర్మించారు. అంతే వేగంగా అందులోని ఫ్లోరింగ్ కుంగిపోవడం సామాజిక మాధ్యమాల్లో ఆదివారం దుమారం రేగింది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఉన్న స్థలాల్లో కమీషన్ల కోసం ఇటీవల పాలకులు, ఆలయ అధికారులు తాత్కాలిక నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అయినా ధనార్జనే ధ్యేయంగా తాత్కాలిక నిర్మాణాలు ప్రారంభించారు. భక్తులకు వసతి కల్పించాలన్న సాకుతో ఆలయ 2వ గేటు సమీపంలో రూ.34లక్షలతో షెడ్డు నిర్మించారు. అలాగే 2వ గేటు నుంచి 3వ గేటు వరకు మాస్టర్ ప్లాన్ కోసం సేకరించిన స్థలానికి హద్దుగా ఎలాంటి అవసరం లేకపోయినా పిట్టగోడను నిర్మించారు. నెల క్రితం ఆర్భాటంగా షెడ్డును ప్రారంభించారు. అంతలోనే షెడ్డు ఫ్లోరింగ్ కుంగిపోయింది. దీన్ని చూసిన కొందరు భక్తులు.. ఇవేం కక్కుర్తి పనులు అంటూ సామాజిక మాధ్యమాల్లో విస్మయం వ్యక్తం చేశారు. శివయ్య సొమ్మును ఇలా స్వాహా చేస్తున్నారంటూ పాలకులు, అధికారులు తీరును బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇకనైనా ముక్కంటి ఆలయ ఇంజనీరింగ్ విభాగంపై దేవదాయశాఖ అధికారులు లోతుగా దర్యాప్తు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రసార మాధ్యమాల్లో ప్రకటనలకు అనుమతి తప్పనిసరి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 31: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ప్రసార మాధ్యమాల్లో వెలువడే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని, ఇందుకోసం జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల రాజకీయ ప్రచార ప్రకటనలు ప్రసారం చేసేందుకు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వార్తా పత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన తర్వాతే ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందని వివరించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్‌సైట్స్ ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయని తెలిపారు. సదరు ప్రకటనకు అయ్యే ఖర్చును సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

అసత్యాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 31: సామాజిక మాధ్యమాల్లో నిరాధారమైన, అసత్య వార్తలు, ప్రకటనలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్‌లు, తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని పేర్కొన్నారు. తప్పుడు సమాచారం, బెదిరింపులు చేయడం వంటివి పోస్టు చేస్తే సంబంధిత అడ్మిన్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అలాంటి పోస్టులు కనిపిస్తే స్థానిక పోలీసులకు కానీ, వాట్సాప్ నెంబరు 80999 99977కు సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



సి.గొల్లపల్లెలో కాల్వ పోరంబోకు ఆక్రమణ

తిరుపతి(రూరల్), మార్చి31: తిరుపతి రూరల్ మండలంలో సి.గొల్లపల్లె పంచాయతీ పరిధిలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే మార్గంలో ఉన్న కాల్వభూమిని కబ్జా చేసేందుకు చదును చేశారు. పక్క పొలాల రైతులు దీన్ని ఆక్రమించి తమ పొల్లాల్లో కలిపేసుకునేందుకు ఎక్స్‌కవేటర్‌తో చదును చేసినట్లు తెలిసింది. ఈ భూమి దాదాపు 0.70 సెంట్ల వరకు ఉంటుందని, దీన్ని రక్షించి ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పదవీ విరమణ సన్మానం



చంద్రగిరి, మార్చి 31: మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సులోచన ఆదివారం పదవీ విరమణ చేయడంతో అధికారులు సన్మానించారు. తహసీల్దార్ మారుతి, డీటీలు మోహన్‌రెడ్డి, అమృత, ఈడీటీ శైలజ, సర్వేయర్ పురుషోత్తంరెడ్డి, ఎస్వో స్వర్ణలత, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



సీఎస్‌ఐ సెయింట్ పాల్స్ చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు, దైవ సందేశం అందిస్తున్న పాస్టర్ ప్రేమ్‌కుమార్

పాకాల, మార్చి 31: ఈస్టర్ వేడుకలను మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఏసుక్రీస్తు శిలువపై మరణించి సమాధి చేయబడి మూడో రోజున పునరుత్థానుడై లేచిన సందర్భాన్ని పురస్కరించుకుని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి, సీఎస్‌ఐ టౌన్ చర్చి, సీఎస్‌ఐ సెయింట్ పాల్స్ చర్చిలలో ప్రార్థనలు చేశారు. పాస్టర్ ప్రేమ్‌కుమార్, ఆర్సీఎం చర్చి ఫాదర్ ఆంతోనిరాజ్, సీఎస్‌ఐ పాస్టర్ ప్రేమ్‌కుమార్, కార్యదర్శి విక్టర్ ఎం.రాఘవేలు, ట్రెజరర్ అరుళ్ సెల్వి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన



తిరుచానూరు, మార్చి 31: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్ - హనుమ అవార్డుకు చెందిన కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం నగరవాసులను ఆకట్టుకుంది. కళాకారులు రిషిత, ఆవని, వెంకట వినూత్న, మిన్నిల, శివాని, నందన, లిషిత, అక్షర, సత్య మనస్విని, భవ్యశ్రీ, భవిష్య, వసుంధర, తుషార దవళ, హర్షిత, ఊర్వశి తదితరులు భో శంభో, ఏక దంతాయ, ముద్దుగారే యశోద, చూడచక్కని తల్లి, కోయిలారే, బ్రహ్మమొక్కటే, తిరుతిరు జవరాలు, వచ్చెను, అలమేలుమంగ, శివశివ శంకర తదితర కీర్తనలకు నృత్యం చేశారు. వారాంతపు సెలవు కావడంతో శిల్పారామం సందడిగా మారింది. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

శేషాద్రినగర్‌ను ప్రత్యేక పంచాయతీ చేస్తాం: నాని

తిరుచానూరు, మార్చి 31: తాము అధికారంలోకి రాగానే పాడిపేట పంచాయతీలోని శేషాద్రినగర్‌ను ప్రత్యేక పంచాయతీగా చేస్తామని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని శేషాద్రినగర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నేతలు ఈశ్వరరెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కళావతి, మునికృష్ణారెడ్డి, మల్లికార్జున, మహేశ్వరి, వాణి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

తిరుపతి(రూరల్): ఓటేరులో నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి నాని హాజరయ్యారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. జనసేన నేత దేవర మనోహర్, బీజేపీ నేత మేడసాని పురుషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

చంద్రగిరిలో వైసీపీకి బీటలు

- టీడీపీలోకి భారీగా చేరికలు
- కష్టకాలంలో అండగా ఉన్నవారిని మర్చిపోను: పులివర్తి నాని

చంద్రగిరి, మార్చి 31: చంద్రగిరి మండలంలో వైసీపీకి బీటలు వారాయని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. ఆదివారం అగరాలలో జరిగిన టీడీపీ బహిరంగ సమావేశంలో ఆయన సమక్షంలో అగరాల, ఐతేపల్లె, పులిత్తివారిపల్లె గ్రామాల్లోని వంద వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. వైసీపీ శ్రేణులు టీడీపీలోకి భారీగా తరలివస్తున్నాయని చెప్పారు. అగరాలలో కొన్ని అరాచక శక్తులు టీడీపీ ప్రచారాన్ని అడ్డుకోవాలని చూడడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇక్కడి సహజ సంపదను దోచేసి ఒంగోలుకు మకాం మార్చాడని దుయ్యబట్టారు. టీడీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన చంద్రగిరిలో 50 పడకల ఆస్పత్రితప్ప వైసీపీ పాలనలో అభివృద్ధి ఏమీ జరగలేదని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అగరాలలో మినీ షాదీ మహల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవారిని మర్చిపోనని.. కార్యకర్తలను, ప్రజలను తన కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని చెప్పారు. వారం నుంచి కుల, మత విభేదాలను ఎమ్మెల్యే సృష్టిస్తున్నారని.. ఆయన ట్రాప్‌లో పడొద్దని హితవు పలికారు. టీడీపీలో చేరిన వారిలో.. అగరాల పంచాయతీకి చెందిన మణికంఠ, ప్రేమ్‌కుమార్, జస్వంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేష్ యశ్వంత్‌రెడ్డి, రవి, రవిచంద్రారెడ్డి, నాగభూషణం, సుబ్బు, కిరణ్‌కుమార్, ఇర్ఫాన్, బాలు, అబ్దుల్, ఇమ్రాన్, సురేష్, బాలాజి, మస్తాన్, గణేష్, రాజేష్, కార్తీక్, రాజు చెంగల్రాయులు, ఎర్రయ్య, చాంద్‌బాషా, సైపుల్లా, భవి, మంజు, లక్ష్మి, అమ్ములు, ఐతేపల్లె పంచాయతీలో గిరి, ప్రసాద్, రంజిత్, గణేష్, వంశీ, మోహన్, సూరి, సన్నీ, జగదీష్, రాజేష్, పురంధర్‌యాదవ్, ఏజీ పల్లెకు చెందిన శివ, మునికృష్ణ, మునిరత్నం, ధనంజయులు, వెంకటముని, సుబ్రహ్మణ్యం, పులిత్తివారిపల్లెకు చెందిన సురేష్, రాజేష్, గోపి, జగదీష్, లోకేష్, ఉదయ్, శంకర్, శ్రీను, సుబ్బు, శశి, కోటి, అరవింద్, మోహన్, తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, నాయకులు కుమారరాజారెడ్డి, శివకోటిరెడ్డి, రమేష్‌రెడ్డి, కొటాల సుధా, కొండూరు ప్రవీణ్, బాలకృష్ణమూర్తి, బెల్లంకొండ రమేష్‌రాయల్, ఎల్లప్పరెడ్డి, గౌస్‌బాషా, బీజేపీ నేత మేడసాని పురుషోత్తం నాయుడు, జనసేన నాయకులు దేవర మనోహర్, బీగాల అరుణ పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండలంలోని సీకే పల్లె పంచాయతీ చిట్టత్తూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు నాగరాజు, చెంచురామయ్య, గోవిందయ్య, కృష్ణారెడ్డి, మునిచంద్రయాదవ్‌తోపాటు పది కుటుంబాల వారు ఆదివారం టీడీపీలో చేరారు. వీరికి పులివర్తి నాని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు నరసింహారెడ్డి, విజయకుమార్, చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి రూరల్‌లో..

తిరుపతి(రూరల్): మండలంలోని చిగురువాడ గ్రామ పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నేతలు ఆదివారం టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంరెడ్డి తోపాటు ఆయన వర్గీయులు 15మంది వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పులివర్తి నాని పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో.. శివయాదవ్, రఫీ, యశ్వంత్, సాయి, రుద్రయ్య, వెంకటేష్, రఘు, షబ్బీర్, చెంచురామయ్య, అబ్దుల్ రెహ్మాన్, వీబీఎస్‌యాదవ్,నాగరాజు, నవీన్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



ఎర్రావారిపాళెంలో..

ఎర్రావారిపాలెం: ఎల్లమంద పంచాయతీలో వైసీపీకి చెందిన పలువురు యువకులు టీడీపీలో చేరారు. ఎల్లమంద పంచాయతీ ఓఎస్ గొల్లపల్లెకు చెందిన జ్ఞానేంద్రరెడ్డి, ఇరగం రెడ్డి, శేఖర్ రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, బాబు రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డిలు పులివర్తి నాని సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. పార్టీ నాయకులు నిరంజన్, చిన్నప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులతో పులివర్తి నాని

అభినందన



అవార్డు అందుకుంటున్న చిల్లీస్ అధినేత అంజి

తిరుపతి(కొర్లగుంట), మార్చి 31: రెడ్ ఎఫ్ఎం బిజినెస్ బ్రిలియన్స్ అవార్డు అందుకున్న హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ నగరాధ్యక్షుడు, చిల్లీస్ అధినేత అంజీని తిరుపతి హోటల్స్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. సేవాగుణం కలిగిన అంజి ఇలాంటి అవార్డులు మరిన్ని అందుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ



ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, మార్చి 31: నగర ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా పామిడి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం ఆర్యవైశ్య సంస్కృతి భవనంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కొండూరు మహేష్, కోశాధికారిగా శిరీషా మంజునాథ్, కో ట్రెజరర్‌గా కామిశెట్టి కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న పసుపర్తి గోపీనాథ్‌ను గౌరవాధ్యక్షుడిగా నియమించారు.

శేష జీవితం సంతోషంగా గడపండి



ఉద్యోగ విరమణ పొందిన కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 31 : విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిడులకు గురై ఉంటారని, శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆకాంక్షించారు. తిరుపతి జిల్లాలో ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఆయన ఘనంగా సన్మానించారు. ఏఆర్ఎస్‌ఐ ఎన్.తులసీదాస్, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కరనాయుడు, టి.సుబ్రహ్మణ్యం రెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, ఎస్బీ సీఐ శ్రీనివాసులు, ఎస్బీయూ సీఐ మురళీకృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ హరినాథ్‌కు సన్మానం



డాక్టర్ హరినాథ్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

తిరుపతి(వైద్యం), మార్చి 31 : ఎస్వీ ఆయుర్వేద వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ రమేష్‌ను ఆస్పత్రి సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. కళాశాలతో, సిబ్బందితో ఆయనకు ఉన్న అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 31 : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను బేషరతుగా విడుదల చేయాలని ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు వి.నాగరాజు, నీరుగట్టు నగేష్, రాంభూపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం కళ్లకు గంతలు, చేతలకు బేడీలు ధరించి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై ఈడీ కేసులు నమోదు చేసి, అరెస్టు చేయడం అన్యాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్ రాయల్, టి.సుబ్రమణ్యం, మాంగాటి గోపాల్‌రెడ్డి, ఎన్‌డి రవి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ తోరణ నిర్మాణ పనుల్లో ఆలస్యం

- ఇరుకైన మార్గంలో వాహనదారుల అవస్థలు



తిరుపతి(కొర్లగుంట), మార్చి 31 : టీటీడీ సహకారంతో తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి స్వాగత తోరణం(ఆర్చీ) నిర్మాణాన్ని జనవరిలో ప్రారంభించారు. పిల్లర్స్‌ను అనుసంధానం చేస్తూ పైకప్పు వేసేందుకు రోడ్డు మొత్తం కొయ్యలు నిలబెట్టేశారు. వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయంగా పక్కనే చిన్నపాటి సందు వదిలారు. పనులు నిదానంగా సాగుతుండడం, రోడ్డు సరిపోకపోవడంతో వాహనదారులు రోజూ అవస్థలు పడుతున్నారు. ఆలయాన్ని సందర్శించే వారికి మార్కెట్, రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే వారికి ఇబ్బంది తప్పడం లేదు. నెలన్నర వ్యవధిలో జాతర ఉన్న నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పలమనేరులో ఒంటరి ఏనుగు

పలమనేరు, మార్చి 31: పలమనేరులో శనివారం అర్ధరాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. సమీప అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగు.. పట్టణానికి ఆనుకుని ఉండే గంటావూరు వద్ద జాతీయ రహదారి దాటింది. ఆ సమయంలో జాతీయరహదారిపై వచ్చిన వాహనదారులు రోడ్డు దాటుతున్న ఏనుగును చూసి భయాందోళన చెందారు. దాదాపు 20 నిమిషాలపాటు ఒంటరి ఏనుగు రోడ్డు దాటలేక రోడ్డుపక్కనే నిల్చొని ఉండిపోయింది. అటు పిమ్మట ఒంటరి ఏనుగు తిన్నగా రోడ్డు దాటి అవతలి వైపు ఉన్న చెరువు గుండా గంగవరం అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది.

సహకారశాఖలో ట్రాక్టర్లు మాయం!



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, మార్చి 31: వర్షాభావం నెలకొన్న ప్రాంతాల్లో అన్నదాతకు ఆసరాగా నిలిచేందుకు సహకార సొసైటీలకు ప్రభుత్వం సమకూర్చిన ట్రాక్టర్లు మాయమయ్యాయి. ఆర్‌కేవీవై పథకం కింద 2013-14వ ఆర్థిక సంవత్సరంలో రూ.33కోట్లు ఖర్చు చేసి 660 ట్రాక్టర్లను సహకార సొసైటీలకు అందించగా ప్రస్తుతం అవి ఎక్కడా కనిపించడం లేదు. సహకార సొసైటీల్లో అడ్డదారిలో పెత్తనం వెలగబెట్టిన వారే వాటిని స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రీయ కృషివికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఏడు రాష్ట్రాల్లో కేంద్ర ప్రారంభించింది. వర్షాభావ ప్రాంతాల్లో అపరాలు, నూనెగింజలు పండించే పది గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, అక్కడ కనీసం 10 శాతం అధిక ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేశారు. రాష్ట్రంలో 48.28 లక్షల హెక్టార్లలో 34.58 లక్షల మెట్రిక్ టన్నుల గింజల ఉత్పత్తి కోసం 21 జిల్లాలో 660 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌కు రూ.5లక్షలు వెచ్చించి 35 హెచ్‌బీ ట్రాక్టరు, రోటా వేటరు, సాళ్లల్లో విత్తనాలను వేసే యంత్రం (రిడ్జ్‌పర్‌ప్లాంటర్)లను సొసైటీలకు అందించారు. ఇందుకోసం రూ.33 కోట్లు ఖర్చు చేశారు. మండలాల్లో సహకార సొసైటీ(పీఏసీఎస్)ల సీఈవో, మండల వ్యవసాయ అధికారులు వీటి పర్యవేక్షణ చేయాల్సి వుంది. క్లస్టర్లలోని సభ్యులకు దుక్కి కోసం ఎకరానికి రూ.200 వసూలు చేసి ప్రతినెలా ఉన్నతాధికారులకు వివరాలు పంపాలి. ప్రారంభంలో సవ్యంగానే సాగినా, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, చాలా చోట్ల ఈ ట్రాక్టర్లు, ఇతర యంత్ర పనిముట్లు క్రమేపీ కనుమరుగయ్యాయి. పీఏసీఎస్ పాలక వర్గాల పదవీకాలం ఐదేళ్ల క్రితమే పూర్తయినా అప్పటి నుంచి ఎన్నికలు జరగలేదు. నామినేటెడ్ పద్ధతిలో ఆరు నెలల చొప్పున ఐదేళ్లు త్రిమెన్ కమిటీలే కొలువుదీరాయి. ఇందులో 100 శాతం వైసీపీ నేతలే పర్సన్ ఇచ్చార్జులుగా పెత్తనం చలాయించారు. పార్టీలోని వర్గవిభేదాలతో కొన్నిచోట్ల ఆరు నెలలకు పర్సన్ ఇన్‌చార్జులు మారిపోగా, కొన్నిచోట్ల ఒక్కరే ఇప్పటి దాకా కొనసాగారు. సర్వజన సభలు, పూర్తి పాలక వర్గం లేకపోవడంతో వీళ్ల ఆడిందే ఆటగా సాగింది. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఆర్‌కేవీవై ట్రాక్టర్లను వీళ్లే స్వాహా చేశారని ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చాక ట్రాక్టర్ల విషయమై ప్రస్తావించిన ఆశాఖ అధికారులను వైసీపీ నేతలు తమదైన శైలిలో బెదిరించడంతో, ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిసింది.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- కారు హారన్ కొట్టడంపై ఆగ్రహిస్తూ ఎంపీటీసీపై వలంటీరు సహా ముగ్గురి దాడి
- పోలీసుల అదుపులో నిందితులు



పోలీస్ స్టేషన్ వద్ద గుమికూడిన సి.బండపల్లె గ్రామస్తులు - దాడిలో దెబ్బతిన్న కారు - పోలీసుల అదుపులో నిందితులు (మధ్యలో వ్యక్తి వలంటీరు)

శాంతిపురం, మార్చి 31: వలంటీరు సహా మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. రోడ్డుపై మద్యం తాగుతుండగా.. ఆ దారిన వస్తున్న కారు హారన్ కొట్టడంతో ఆగ్రహించారు. కారులోని ఎంపీటీసీ నామాలప్పపై దాడి చేశారు. ఆయన పోలీసు స్టేషన్‌కు పరుగుతీసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈఘటన శాంతిపురం మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. సి.బండపల్లెకు చెందిన ఎంపీటీసీ నామాలప్ప శనివారం రాత్రి వి.కోట నుంచి కారులో బయలుదేరారు. తన స్నేహితులను కొత్తపేట గ్రామంలో వదిలిపెట్టి అర్ధరాత్రి సమయంలో తన స్వగ్రామానికి రాళ్లబూదుగూరు గసికపల్లె రోడ్డులో వెళుతున్నారు. అదే సమయంలో రాళ్లబూదుగూరు తిమ్మరాయస్వామి దేవాలయం సమీపంలో నడి రోడ్డుపైన నలుగురు యువకులు మద్యం తాగుతున్నారు. వారిని చూసి ఈయన హారన్ కొట్టారు. ఎందుకురా హారన్ కొడతావంటూ ఆ నలుగురిలో ముగ్గురు యువకులు కారుపై దాడి చేయడంతో అద్దం పగిలిపోయింది. ఎందుకు గొడవ చేస్తున్నారంటూ నామాలప్ప డోరు తీయగానే ఆ ముగ్గురు అతడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. 'ఒంటిపైన గుడ్డలు చించేశారు. మెడలోని బంగారు చైను, ఉంగరాలు, కొంత నగదు లాక్కొన్నారు. అవిపోతే పోనీ నన్ను ప్రాణాలతో వదిలేయండి.. బిడ్డల గల వ్యక్తిని. మీ కాళ్లు పట్టుకుంటాను అని వేడుకున్నా. కనికరం లేకుండా దారుణంగా కొట్టారు. ఇంక చంపేస్తారని భయంతో కేకలు వేశా. ఆ అరుపులకు చుట్టుపక్కల ఉన్న వారు పరుగున అక్కడికి చేరుకుని ఆ యువకులను అడ్డుకున్నారు. ఇంతలో నేను కూతవేటు దూరంలో ఉన్న పోలీసు స్టేషనుకు చేరుకుని చేరుకుని జరిగిన విషయం చెప్పా. నేను ఇచ్చిన సమాచారంతో నా బంధువులు పోలీసు స్టేషనుకు చేరుకున్నారు' అంటూ నామాలప్ప వివరించారు. దాడిలో గాయపడిన అతడిని కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దాడి జరిగిన ప్రదేశానికి పోలీసులు వెళ్లగా.. వీరిని చూసి ముగ్గురు పరారవగా ఒక యువకుడు దొరికాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆదివారం ఉదయం మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన ముగ్గురిలో రాళ్లబూదుగూరుకు చెందిన పట్టాభి అలియాస్ పటాలి, వలంటీరు దిలీప్, రవి ఉన్నారు. నామాలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.



గాయపడిన ఎంపీటీసీ నామాలప్ప

టీడీపీ నేతల పరామర్శ

కుప్పంలో చికిత్స పొందుతున్న ఎంపీటీసీ నామాలప్పను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, కాణిపాకం వెంకటేష్, శాంతిపురం మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జులు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పరామర్శించారు. అతడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

వైసీపీ అల్లరిమూకలూ జాగ్రత్త

- ఎంపీటీసీపై దాడిని ఖండించిన చంద్రబాబు

సి బండపల్లె ఎంపీటీసీ నామాలప్పపై జరిగిన దాడిని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఖండించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను ఆదివారం ఫోను ద్వారా మాట్లాడి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శాంతి భద్రతలు దెబ్బతినే విధంగా వైసీపీ అల్లరి మూకలు ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇదే తంతు కొనసాగితే ఎన్నికల తర్వాత కుప్పం ప్రజలు వైసీపీ గూండాలను తరిమేస్తారన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. తనపై ముగ్గురు దాడికి పాల్పడ్డారని బాధితుడు చెబుతున్నా.. ఒక్కరినే పోలీసులు గుర్తించడం సరికాదన్నారు. వలంటీరుతో పాటు మిగతా వారిపైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

గంజాయి మత్తులో యువకుల ఘర్షణ

నాయుడుపేట టౌన్, మార్చి 31: గంజాయి మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని బీడీ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన యువకుడిపై నాయుడుపేట పట్టణానికి చెందిన మరో యువకుడు గంజాయి మత్తులో బ్లేడ్‌తో మెడపై దాడిచేసి గాయపరిచాడు. స్థానిక యువకులు అడ్డుకుని గాయపడిన యువకుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్ పాయింట్స్‌లో ప్రకటనల బ్యానర్స్

తిరుపతి(కొర్లగుంట), మార్చి 31 : నగరంలో శిథిలావస్థకు చేరుకున్న ట్రాఫిక్ పాయింట్స్ స్థానంలో తాజా సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తవి ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. మూడు నెలల క్రితం ట్రాఫిక్ పాయింట్స్‌ను ఆయా కేంద్రాల వద్ద దించారు. వాటిని పూర్తిస్థాయిలో అమర్చకుండా వదిలేశారు. కొన్నిచోట్ల అవి దారికి అడ్డుగా ఉంటూ వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. కొందరైతే వాటిపై ప్రకటనల బ్యానర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



ద్విచక్ర వాహనం చోరీ

రామచంద్రాపురం, మార్చి 31: నెత్తకుప్పం దళితవాడకు చెందిన చంద్రబాబు ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనం శనివారం రాత్రి చోరీకి గురైంది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, పదిరోజుల క్రితం ఇదే గ్రామంలో 32గ్రాముల బంగారు, దొరస్వామి ఇంట్లో రూ.3లక్షలు చోరీకి గురైంది.

శ్రీవారి సేవలో హిమాచల్‌ప్రదేశ్ సీఎం

తిరుమల, మార్చి31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్‌విందేర్ సింగ్ సుక్కు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



తిరుపతి

'పారిజాతపర్వం' కడుపుబ్బ నవ్విస్తుంది

- చిత్ర యూనిట్ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న చిత్ర యూనిట్

తిరుపతి అర్బన్, మార్చి 31: పారిజాతపర్వం చిత్రం ఈనెల 19వ తేదీన విడుదల కానుందని, కడుపుబ్బ నవ్విస్తుందని ఆ చిత్ర నటీనటులు చైతన్య, శ్రద్ధాదాస్ తెలిపారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నటులు సునీల్, హర్ష, దర్శకుడు సంతోష్ కంభంపాటితో కలిసి వారు ఆదివారం తిరుపతిలో పర్యటించారు. ప్రైవేటు హోటల్లో మీడియాతో మాట్లాడుతూ కిడ్నాప్ డ్రామా, క్రైం, కామెడీ కలిసిన కుటుంబ కథా చిత్రమే పారిజాతపర్వం అన్నారు. చుర్రుమంటున్న వేసవిలో చల్లగా, అందంగా, ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికే విడుదలైన ఓ పాటకు మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రముఖ నటుడు సునీల్ డాన్ పాత్ర పోషించారన్నారు. శ్రద్ధాదాస్ మాట్లాడుతూ కొంత విరామం తర్వాత పూర్తి నిడివి చిత్రంలో నటించానన్నారు. అంతకుముందు వారు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారితోపాటు ప్రేక్షకుల ఆశీస్సులూ ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.

శరీరానికి మంచి ఔషధం క్రీడలు



2కే రన్‌ను ప్రారంభిస్తున్న శ్రీరామ్

తిరుపతి(క్రీడలు), మార్చి 31 : మానవ శరీరానికి ఉత్తమమైన ఔషధం క్రీడలేనని సినీనటుడు శ్రీరామ్ అన్నారు. అలిపిరి జూపార్కు మార్గంలో ప్లే టు లెర్న్ ఆర్టిజన్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆటిజం అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీరామ్ చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ ఉత్సాహపరిచారు. పిల్లలను క్రీడల పట్ల తల్లిదండ్రులు ప్రోత్సాహించాలన్నారు. దివ్యాంగులను గౌరవించాలని, అందరితో సమానంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పచ్చజెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీటీ మెడికేర్ ఛైర్మన్ కె.వి.చౌదరి, ఎడిఫై విద్యాసంస్థల అధినేత ప్రణీత్, శుభమస్తు షాపింగ్‌మాల్ ఎండీ వెంకట రవికుమార్, డాక్టర్ రణధీర్‌రాజు, చోళరాజు, గడ్డం రవిశంకర్‌రాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పినా చెవికెక్కదులే!

● వైసీపీ ప్రచారంలో వలంటీరు



44వ డివిజన్‌లో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీరు ముస్తఫా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 31: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని వలంటీర్లు, ఉద్యోగులు, రేషన్ షాపు డీలర్లు, వార్డు సెక్రటరీలు, ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకునే వారికి ఎన్నికల కమిషన్ పదేపదే చెపుతున్నా చెవికెక్కించుకోవడంలేదు. వైసీపీ ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. ముఖ్యంగా తిరుపతిలోని కొన్ని డివిజన్లలో వాలంటీర్లు, రేషన్‌షాపు డీలర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొంటున్నారు. తాజాగా 44వ డివిజన్‌లో వైసీపీ అభ్యర్థి తరపున టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డితో కలిసి సప్తగిరినగర్‌లో రేషన్ షాపు డీలర్లు శారద, నాదముని, వాలంటీరు ముస్తాఫా పాల్గొన్నారు. కొన్నిచోట్ల మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు, నీటి సరఫరా శాఖలోని 4వ తరగతి సిబ్బంది ప్రచారంలో పాల్గొన్నట్లు ఆరోపణలు వచ్చాయి. తాజాగా 44వ డివిజన్‌కు చెందిన వలంటీర్లు ముస్తాఫా, కమలేష్‌ను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కొందరు కార్పొరేటర్లు వలంటీర్లకు సంబంధించి కొత్తగా వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి, వారి ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆపస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దేవరాజులు



తిరుపతి(విద్య), మార్చి 31: ఆపస్ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జిగా డాక్టర్ దేవరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం శ్రీకాళహస్తిలో జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన ఆపస్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సహాధ్యక్షుడు చక్రపాణి తిరుపతి కన్వీనర్‌గా దేవరాజులును ప్రకటించగా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. తనపై నమ్మకముంచి కీలక బాధ్యతలు అప్పగించిన సంఘానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల అనుమతితోనే వైసీపీకి రాజీనామా

● మాజీ సర్పంచ్ అన్నా రామకృష్ణయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న అన్నా రామకృష్ణయాదవ్

తిరుపతి (జీవకోన), మార్చి 31: స్థానిక ప్రజల అనుమతితోనే వైసీపీకి రాజీనామా చేయనున్నట్లు జీవకోన మాజీ సర్పంచ్, వైసీపీ నేత అన్నా రామకృష్ణయాదవ్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం జీవకోనలోని గురుకృప పాఠశాల వద్ద అనుచర వర్గం, స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. వైసీపీలో తన కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. ప్రజల అనుమతితోనే రాజీనామాకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే తమ కుటుంబంలో 48, 49 డివిజన్ల కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత వైసీపీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. మొదటి నుంచి కూడా జీవకోనలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో అన్నా కుటుంబం ముందుందన్నారు. ఈ సమావేశంలో అన్నా రామచంద్రయాదవ్, ఆర్‌ఆర్ యాదవ్, బలరాం యాదవ్, వెంకటేష్, చిరంజీవి, దిలీప్, మహేష్ పాల్గొన్నారు.

ఫిడె రేటింగ్ ఓపెన్ టోర్నీకి ఎంపిక



ఎంపికైన చెస్ క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), మార్చి 31 : భీమవరంలో జూన్ 4నుంచి 9వ తేదీ వరకు జరిగే ఫిడె రేటింగ్ ఓపెన్ టోర్నమెంట్‌కు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆదివారం యూత్ హాస్టల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. 102మంది అండర్ 7, 9, 11, 13 విభాగాల్లో పోటీపడ్డారు. ప్రతిభ కనబరిచిన వి.త్రిపురాంబిక, కె.లతీష్‌రెడ్డి, కె.ఈ.కె.బిల్వనిలయ, ఎస్.అభిజయ్‌ను ఎంపిక చేశారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాలర్ దివాకర్‌రెడ్డి క్రీడాకారులను అభినందించి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

పెన్షన్ పంపిణీని వైసీపీ రాజకీయం చేస్తోంది

● తెలుగు యువత నేత రవినాయుడు

తిరుపతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్లతో పెన్షన్ పంపిణీ చేయొద్దని ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో దాన్ని కూడా వైసీపీ రాజకీయం చేస్తోందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ జీతం తీసుకుని వాలంటీర్లు వైసీపీ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని, అలాంటప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడంలో తప్పు కాదని పేర్కొన్నారు. ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని తెలుగుదేశం పార్టీపై రుద్దడం సరికాదని పేర్కొన్నారు. టీడీపీ వల్లే పింఛను ఆగిపోయిందని ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వాలనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి వైసీపీకి కోవర్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వాలంటీర్లతో కావాలనే రాజీనామా చేయించి ప్రచారం చేయడానికి వాడుకుంటున్నారని పేర్కొన్నారు.

ఇంటిస్థలాలు అడిగితే అరెస్ట్ చేస్తారా !

తిరుపతి (ఆటోనగర్)మార్చి31: పేదలు ఇంటి స్థలాలు చూపమని అడిగితే అరెస్ట్ చేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వి. నాగరాజు పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ఇంటిపట్టాలు ఇచ్చి నేటికీ స్థలాలు చూపకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు స్థలాలు చూపడంలో విఫలమైనపుడు ఆక్రమించుకునే ప్రయత్నం చేయడంలో తప్పులేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

4 నుంచి అన్నమయ్య వర్ధంతి కార్యక్రమాలు

తిరుపతి (కల్చరల్), మార్చి 31: పదకవితా పితామహుడు అన్నమయ్య 521వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సులు నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. 4వ తేదీ ఉదయం 6 గంటలకు అలిపిరి వద్ద మెట్లోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొంది. 5న తిరుమలలో ఇదే కార్యక్రమం ఉంటుందని తెలిపింది. 6నుంచి 8వ తేదీ వరకూ తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సభలు నిర్వహిస్తారని వెల్లడించింది.

9న గోవిందరాజస్వామి ఆలయంలో ఉగాది ఆస్థానం

తిరుపతి (కల్చరల్), మార్చి 31: గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 9వ తేదీన ఉగాది ఆస్థానం నిర్వహించనున్నారు. స్వామి వారికి సుప్రభాతం, తోమాల సేవ, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. 4వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేయనున్నారు. ఆలయాన్ని పరిమళ సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

సామూహిక గాయత్రీమంత్ర జపం

తిరుపతి (కల్చరల్), మార్చి 31 : కేసీడీటీ ట్రస్ట్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక గాయత్రి మంత్ర జప హవనం జరిగింది. సికింద్రాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీ దాస్ మెమోరియల్ ట్రస్ట్ తిరుపతి విభాగం ఇన్‌ఛార్జ్ ఖండవల్లి రాధాకృష్ణ సారథ్యంలో ప్రాతః సంధ్యావందనం, గాయత్రి జపాలు చేశారు. తిరుపతి జోన్ పరిధిలోని పలువురు జపతులు ఇందులో పాల్గొన్నారు. లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న శతకోటి గాయత్రీ మహా మంత్ర జప యజ్ఞంలో భాగంగా కొర్లగుంట మారుతినగర్‌లోని కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నందనవనం వేంకటరమణప్రసాద్ తెలిపారు.

ఏపీఆర్‌జేసీ దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), మార్చి 31: రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో(ఏపీఆర్‌జేసీ) 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షా దరఖాస్తు గడువును ఈనెల 5వ తేదీ వరకు పొడిగించారని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం ఛైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ పాలిసెట్-2కే24 దరఖాస్తు గడువు కూడా అదే రోజు వరకు ఉందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేయాలని కోరారు. ఇతర వివరాలకు 8688888802/03, 9399976999లను సంప్రదించాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.05 కోట్లు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.05 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 79,907 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 34,037 మంది తలనీలాలు సమర్పించారు.

సంస్కృత వర్సిటీలో ముగిసిన టాలెంట్ ఫెస్ట్

● ఆతిథ్య వర్సిటీకి విజయ వైజయంతి షీల్డ్ ప్రదానం





మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి - విజయ వైజయంతి షీల్డ్‌ను అందుకుంటున్న సంస్కృతవర్సిటీ విద్యార్థులు

తిరుపతి(రూరల్),మార్చి31: తిరుపతిలోని సంస్కృత వర్సిటీ వేదికగా నాలుగు రోజులపాటు నిర్వహించిన ఆలిండియా సంస్కృత విద్యార్థుల టాలెంట్ ఫెస్ట్-2కే24 ఆదివారంతో ముగిసింది. దేశవ్యాప్తంగా ఉన్న పలు సంస్కృత వర్సిటీలకు చెందిన విద్యార్థులు భాషణ, క్రీడా, సాంస్కృతిక, యోగా పోటీలలో పాల్గొని ప్రతిభని చాటారు. అత్యధిక బహుమతులు సాధించిన ఆతిథ్య తిరుపతి సంస్కృత వర్సిటీ విద్యార్థులు విజయ వైజయంతి షీల్డ్‌ని కైవసం చేసుకున్నారు. భాషణ, సాంస్కృతిక, క్రీడా, యోగా వంటి వివిధ పోటీలలో విజేతలుగా నిలచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను చాటేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో హాజరైన కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతి మాట్లాడుతూ సంస్కృతాన్ని ఇంకా అభివృద్ధి చేయాలని, శంకరాచార్యుల మార్గాన్ని అనుసరిస్తూ ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతలకు సంబంధించిన కార్యక్రమాలను విశేషంగా చేపట్టాలని ఆకాంక్షించారు. సీబీడీ విభాగ ఎస్పీ ఎస్‌వీఎస్ స్వామి మాట్లాడుతూ ప్రతిభా పోటీలలో భాగస్వామ్యం కావడమే విజయంతో సమానమని, బహుమతులు సాధించడం ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్సిటీ ద్వారా సంస్కృత భాష సంరక్షణ, ప్రచారంతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ, ప్రొక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ టీవీ రాఘవాచార్యులు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంజీ నందనరావు, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.దత్తాత్రేయశర్మ, అద్వైత వేదాంతవిభాగ ప్రొఫెసర్ గణపతిభట్ తదితరులు పాల్గొన్నారు.


ఇది కోడ్ ఉల్లంఘన కాదా ?



సంస్కృత వర్సిటీలో ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న శంకర్‌నాయక్, వీసీ కృష్ణమూర్తి

తిరుపతి(రూరల్), మార్చి 31 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా తిరుపతి సంస్కృత యూనివర్సిటీలో ఆదివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ సిబ్బందికి ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేయడం విమర్శలకు దారితీసింది. వర్సిటీలో గతంలో ఫ్యాకల్టీకి ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఆ రోజు తీసుకోనివారు ఆదివారం సాయంత్రం చెలికాని అన్నారావు క్లాసరూమ్ కాంప్లెక్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో తీసుకోవాలని రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేశారు. ఇదే కార్యక్రమానికి శంకర్‌నాయక్ హాజరై పంపిణీ చేయడం కోడ్ ఉల్లంఘన కాదా అని అధ్యాపక, సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తితోపాటు రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ హాజరు కావడం గమనార్హం.

సముద్రాల లక్ష్మణయ్య అమరుడు



తిరుపతి (కల్చరల్), మార్చి 31: ఎంతో లోతైన విజ్ఞానం కలిగిన సముద్రాల లక్ష్మణయ్య అంతే వినయ సంపన్నత కలిగి ఉండేవారని, ఆయన అమరుడని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. లక్ష్మణయ్య ప్రథమ సాంవత్సరిక సమారాధన ఆదివారం సాయంత్రం వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. పలు వ్యాసాలతో కూడిన సంస్కృతాంధ్ర సాహిత్య సుమాల మాల సముద్రాల అనే ప్రత్యేక సంచికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ టీటీడీకి లక్ష్మణయ్య సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ సభలో ఇంకా శుకబ్రహ్మాశ్రమం ఉత్తరాధికారి సంపూర్ణానంద, శ్రీనివాసమంగాపురం సమీపంలోని వశిష్టాశ్రమ వ్యవస్థాపకుడు స్వస్వరూపానంద, తిరుపతి రామకృష్ణాశ్రమ సంచాలకులు సుకృతానంద, పంచ సహస్రావధాని మేడసాని మోహన్, కార్మిక నాయకుడు కందారపు మురళి ప్రసంగించారు. భారతీయ విద్యాభవన్ సంచాలకులు సత్యనారాయణ రాజు, రామకృష్ణామిషన్ కార్యవర్గ సభ్యులు జయచంద్రారెడ్డి, పీవీ రెడ్డి, ఆచార్య సర్వోత్తమన్, విభీషణ శర్మ, ఆచార్య దామోదర నాయుడు, శతావధాని ఆముదాల మురళి, గాలి గుణశేఖర్, పల్గుణకుమార్, సముద్రాల లక్ష్మణయ్య సతీమణి అరుంధతి, కుటుంబసభ్యులు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ధ్యానమండలి నూతన కార్యవర్గం



తిరుపతి (కల్చరల్), మార్చి 31: వైఎస్ఎస్ ధ్యాన మండలి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఏడాది పాటు ఉండే కొత్త కమిటీ కోఆర్డినేటర్‌గా తిరుపతి పశువైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఆచార్య డి.శ్రీనివాసులు, సహాయ కోఆర్డినేటర్‌గా ఎం.ప్రకాశం నాయుడు, కార్యదర్శిగా వై.శేషాచలపతి, సహాయ కార్యదర్శిగా డి.సురేంద్ర కుమార్, కోశాధికారిగా ఆర్.శ్రీరాములు ఎన్నికయ్యారు. మరో 8 మందితో కార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక నలందా నగర్‌లో నిర్మాణంలో ఉన్న ధ్యానమందిరం పనులను త్వరగా పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకువస్తామని కొత్త కమిటీ తెలిపింది.

జనసేనలోకి కొనసాగుతున్న చేరికలు

●కండువా కప్పుకున్న బీఆర్ఎస్ నేత ఆర్కాట్



తిరుపతి, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన పార్టీలోకి ఇతర పార్టీల నుంచి చేరికలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) జిల్లా అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ఆదివారం కూటమి తరపున పోటీలో ఉన్న జేఎస్పీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఆరణి శ్రీనివాసులును అఖండ మెజార్టీతో గెలిపించడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆరణి మాట్లాడుతూ తిరుపతిలో అభినయ్ అనే ప్రమాదకర వైరస్ విజృంభిస్తోందన్నారు. కరోనా కన్నా ఈ వైరస్ చాలా ప్రమాదకరమైందన్నారు. తిరుపతి అభివృద్ధిబాటలో మొదటి స్థానంలో నిలవాలంటే తనను గెలిపించాలని కోరారు. జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ఆర్కాట్ జనసేనలో చేరటం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి అభివృద్ధి ఎన్డీయే కూటమితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు మలిశెట్టి లక్ష్మి, పార్టీలో చేరిన నాయకులు రాఘవరెడ్డి, విక్రమన్, సాయికుమార్, వినయ్, మస్తానయ్య, గోపీనాథ్, రఘు, వంశీ, శ్వేత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధిలో ఆనందరావు సేవలు ఎనలేనివి



ఆనందరావు దంపతులను సన్మానిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు తదితరులు

తిరుపతి(విద్య),మార్చి31: జిల్లాలోని పలు పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ హోదాల్లో పనిచేసి సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న దుగ్గం ఆనందరావు ఆయా కళాశాలల అభివృద్ధికి విశేష సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందారని పిల్లారిపట్టు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ కుమార్ పేర్కొన్నారు. తిరుపతి కేటీరోడ్డులోని కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘ భవన్‌లో ఆదివారం ఆనందరావు ఉద్యోగ విరమణ సభను ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ వెంకట్రామిరెడ్డి, ప్రభాకర్, శివరామన్ మాట్లాడుతూ తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎక్కువకాలం పనిచేసి కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేశారని, బోధనేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కారంతోపాటు పరిపాలనలో తనదైన ముద్రవేశారని గుర్తు చేశారు. అనంతరం నాగరత్న, ఆనందరావు దంపతులను ఘనంగా సన్మానించారు. హెచ్‌వోడీలు డాక్టర్ ఎస్వీగౌరీశంకర్, గల్లా కృష్ణమూర్తినాయుడు, ఆప్టసా జిల్లా సెక్రటరీ హేమంత్‌రాయ్, పోస్టలాన్ రాష్ట్ర సెక్రటరీ బాపూజీనాయక్, కుటుంబ సభ్యులు జీవిత, ప్రదీప్, ఎసాయి కుమార్, సి.శివశంకర్, జ్యోష్నకుమారి, చాముండేశ్వరి, కె.కుమారస్వామి, హరిప్రసాద్, గోవిందయ్య పాల్గొన్నారు.

ఆపన్నులకు చేయూత



వంట సరుకులు వితరణ చేస్తున్న ఐక్యం ట్రస్టు ప్రతినిధులు

తిరుపతి అర్బన్, మార్చి 31: ఐక్యం చారిటబుల్ ట్రస్టు రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలో శని, ఆదివారాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదంలో తీవ్రగాయమై కోమాలో ఉన్న కొర్లగుంటకు చెందిన హేమంత్ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. హేమంత్ పాలిటెక్నిక్ చదువుతూ జనవరిలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి డబ్బుల్లేకపోవడం, తల్లి కూలి పనులు మానేసి అతన్ని చూసుకోవాల్సి రావడంతో కుటుంబ పోషణ కష్టమైంది. విషయం తెలుసుకున్న ఐక్యం చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు నాలుగు నెలలకు సరిపడ వంట సరుకులను అందజేశారు. అలాగే ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న నిరుపేద హారికకు చేయూతనందించారు. ఏడాది పాటు బ్యూటీషియన్ కోర్సుకు ఫీజులను భరించారు. కాగా, అమరా హాస్పిటల్ డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో ఓ విద్యాసంస్థలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్యం చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాసులరెడ్డి, వైస్ ఛైర్మన్ రూపేష్, కార్యదర్శి యుగంధర్, పుష్ప, తులసి, మహేష్‌రెడ్డి, నాగరాజు, మోహన్, శంకర్, వెంకట్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), మార్చి 31 : జాతీయ స్కేటింగ్ అండర్ 17, 19 విభాగాలలో 12మంది చొప్పున బాలబాలికలను ఎంపిక చేశారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో రెండు రోజులుగా ఎంపిక పోటీలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 205మంది ప్రాతినిధ్యం వహించారు. ప్రతిభ కనబరిచిన 12మంది బాలురు, 12మంది బాలికలు ఎంపికయ్యారు. వీరు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కార్యదర్శులు జయరామయ్య, విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ ప్రేమ్‌నాథ్, శ్రీనివాసులరెడ్డి, రమణారెడ్డి, బాబ్జి, జితేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





జాతీయ క్రీడలకు ఎంపికైన బాల, బాలికలు

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

15 గ్రాముల బంగారం, 6 కిలోల వెండి స్వాధీనం



చోరీ వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులురెడ్డి

నాయుడుపేట టౌన్, మార్చి 31: చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 15 గ్రాముల బంగారం, 6కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్లు నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం సాయంత్రం వెల్లడించారు. పుత్తూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన నరేష్, పెళ్లకూరు మండలం కలవకూరు గ్రామంలోని తన అత్తగారి ఇంటికి వెళ్లాడు. ఈనెల 18వ తేదీ నాయుడుపేట పట్టణంలోని ఓ బంగారు దుకాణ షెట్టర్‌ను తొలగించి అందులోని 15 గ్రాముల బంగారు నగలు, 6 కిలోల వెండి ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాయుడుపేట పట్టణంలోని గాంధీమందిరం వద్ద నిందితుడు నరేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడ్డ బంగారు, వెండి ఆభరణాల విలువ రూ.4 లక్షలు ఉంటుందన్నారు. కేసు విచారణలో ప్రతిభ కనపరచిన ఎస్‌ఐ గోపి, సిబ్బంది చిరంజీవి, రామమోహన్‌రాజు, దయాకర్, వెంకీలను సీఐ అభినందించారు.

టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి: పాశం



టీడీపీలో చేరిన ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 31: టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈద్గా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు షబ్బీర్ ఆధ్వర్యంలో ముస్లిం యువత టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీపాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఒక్క అభివృద్ధి పని కూడా చేయకుండా మోసం చేసిందన్నారు. ముస్లింల అభ్యున్నతి కోసం చంద్రబాబునాయుడు ఎన్నో పథకాలు అమలు చేశారని, వాటిన్నింటినీ జగన్ నిలిపివేశారని విమర్శించారు. కొవిడ్ సమయంలో ఈద్గా యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రజలకు ఎంతో సేవ చేశారని, వీరంతా స్వచ్ఛందంగా టీడీపీలో చేరడం ఆనందించతగ్గ విషయమన్నారు. యువత భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీ అధికారంలో ఉండాలని ఆకాంక్షించి పలువురు యవకులు పార్టీలో చేరుతున్నారని సునీల్‌కుమార్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రజాప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, వాటంబేడు శివకుమార్, ఇశ్రాయిల్‌కుమార్, రవీంద్రరెడ్డి, పెంచలయ్య, నరసింహులనాయుడు, చంద్రమౌళి, మున్నా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న వేదకార్తిక్‌రెడ్డి

పెళ్లకూరు, మార్చి 31: పెళ్లకూరు మండలం పాలచ్చూరు గ్రామానికి చెందిన వేదకార్తికెరెడ్డి, జశ్వితరెడ్డి రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపారు. ఆదివారం తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయిలో చెస్ పోటీల్లో 200 మందికి పైగా చిన్నారులు పాల్గొనగా, వేదకార్తిక్ రెడ్డి ప్రథమ బహుమతి, జశ్వితారెడ్డి ద్వితీయ బహుమతి అందుకున్నారు.

ఎంపీడీవో గోపీనాథ్‌కు సన్మానం



ఎంపీడీవో గోపీనాథ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

వాకాడు, మార్చి 31: వాకాడు ఎంపీడీవోగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన గోపీనాథ్‌ను ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మండలంలోని స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డితో పాటు రాజకీయ వివిధ పార్టీల నాయకులు, అధికారులు, సిబ్బంది ఎంపీడీవోను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, ఎంఈవో నసీం అలీ, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు



వాకాడు, మార్చి 31: వాకాడు ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఎంపీడీవో గోపీనాథ్‌ను ఆదివారం ఉద్యోగ విరమణ చేయడంతో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును ఇన్‌చార్జిగా నియమిస్తూ కలెక్టర్ లక్ష్మీషా ఉత్తర్వులు ఇచ్చారు.

ఉత్తమ బోధనే లక్ష్యం

చిల్లకూరు, మార్చి 31: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడమే ఎల్‌ఏపీ పాఠశాల లక్ష్యమని కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరం నుంచి తమ పాఠశాలలో 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు ముంబైకి చెందిన లీడ్ ఫౌండేషన్ కంపెనీ ఆధ్వర్యంలో ఐఐటీ అవగాహన తరగతులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. దీంతో విద్యార్థులు భవిష్యత్తులో ఐఐటీలో ర్యాంకు పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీలత, ఓనమఃశివాయ, సురేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

వాకాడు, మార్చి 31: ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని గొల్లపాళెం గ్రామంలో ఆదివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గుర్తులతో వాహనాలను నడపరాదని, అక్రమ మద్యం నిల్వ ఉండరాదన్నారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సూళ్లూరుపేట, మార్చి 31: సూళ్లూరుపేట పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ రహీం రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఆయన తన సిబ్బందితో కలిసి బజారు వీధుల్లో తిరిగారు. వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలపరాదని, దుకాణదారులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

'సూర్య' ప్రతాపం

నిర్మానుష్యంగా ప్రధాన వీధులు

నాయుడుపేట, మార్చి 31: సూర్య భగవానుడు ఆదివారం నిప్పులు కక్కడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం కూడా ఎండ తగ్గకపోవండంతో నాయుడుపేట పట్టణంలో ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. మార్చి చివరి రోజునే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన వీధులు జన సంచారం లేకపోవడంతో కర్ఫ్యూను తలపించాయి.



జనసంచారం లేని వెల్‌కం సెంటర్

సహకారశాఖలో ట్రాక్టర్లు మాయం!



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, మార్చి 31: వర్షాభావం నెలకొన్న ప్రాంతాల్లో అన్నదాతకు ఆసరాగా నిలిచేందుకు సహకార సొసైటీలకు ప్రభుత్వం సమకూర్చిన ట్రాక్టర్లు మాయమయ్యాయి. ఆర్‌కేవీవై పథకం కింద 2013-14వ ఆర్థిక సంవత్సరంలో రూ.33కోట్లు ఖర్చు చేసి 660 ట్రాక్టర్లను సహకార సొసైటీలకు అందించగా ప్రస్తుతం అవి ఎక్కడా కనిపించడం లేదు. సహకార సొసైటీల్లో అడ్డదారిలో పెత్తనం వెలగబెట్టిన వారే వాటిని స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రీయ కృషివికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఏడు రాష్ట్రాల్లో కేంద్ర ప్రారంభించింది. వర్షాభావ ప్రాంతాల్లో అపరాలు, నూనెగింజలు పండించే పది గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, అక్కడ కనీసం 10 శాతం అధిక ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేశారు. రాష్ట్రంలో 48.28 లక్షల హెక్టార్లలో 34.58 లక్షల మెట్రిక్ టన్నుల గింజల ఉత్పత్తి కోసం 21 జిల్లాలో 660 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌కు రూ.5లక్షలు వెచ్చించి 35 హెచ్‌పీ ట్రాక్టరు, రోటా వేటరు, సాళ్లల్లో విత్తనాలను వేసే యంత్రం (రిడ్జ్‌పర్రోప్లాంటర్)లను సొసైటీలకు అందించారు. ఇందుకోసం రూ.33 కోట్లు ఖర్చు చేశారు. మండలాల్లో సహకార సొసైటీ(పీఏసీఎస్)ల సీఈవో, మండల వ్యవసాయ అధికారులు వీటి పర్యవేక్షణ చేయాల్సివుంది. క్లస్టర్లలోని సభ్యులకు దుక్కి కోసం ఎకరానికి రూ.200 వసూలు చేసి ప్రతినెలా ఉన్నతాధికారులకు వివరాలు పంపాలి. ప్రారంభంలో సవ్యంగానే సాగినా, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, చాలాచోట్ల ఈ ట్రాక్టర్లు, ఇతర యంత్ర పనిముట్లు క్రమేపీ కనుమరుగయ్యాయి. పీఏసీఎస్ పాలక వర్గాల పదవీకాలం ఐదేళ్ల క్రితమే పూర్తయినా అప్పటి నుంచి ఎన్నికలు జరగలేదు. నామినేటెడ్ పద్ధతిలో ఆరు నెలల చొప్పున ఐదేళ్లు త్రిమెన్ కమిటీలే కొలువుదీరాయి. ఇందులో 100 శాతం వైసీపీ నేతలే పర్సన్ ఇచ్చార్జులుగా పెత్తనం చలాయించారు. పార్టీలోని వర్గవిభేదాలతో కొన్నిచోట్ల ఆరు నెలలకు పర్సన్ ఇన్‌చార్జులు మారిపోగా, కొన్నిచోట్ల ఒక్కరే ఇప్పటి దాకా కొనసాగారు. సర్వజన సభలు, పూర్తిపాలక వర్గం లేకపోవడంతో వీళ్లు ఆడిందే ఆటగా సాగింది. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఆర్‌కేవీవై ట్రాక్టర్లను వీళ్లే స్వాహా చేశారని ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చాక ట్రాక్టర్ల విషయమై ప్రస్తావించిన ఆశాఖ అధికారులను వైసీపీ నేతలు తమదైన శైలిలో బెదిరించడంతో, ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిసింది.

టీడీపీలో యువత, మహిళలకు ప్రాధాన్యం



టీడీపీలో చేరిన వారితో కొండేపాటి గంగాప్రసాద్, నెలవల

తడ, మార్చి 31: తడ మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. కొండూరు పంచాయతీకి చెందిన వైసీపీ నేత దువ్వూరు శ్యామ్‌సుందర్ రెడ్డి, స్థానిక సర్పంచు వాటంబేడు శ్రీలక్ష్మితో పాటు వార్డు సభ్యులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఆదివారం టీడీపీలో చేరారు. వారందరికీ ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పార్టీ కండువాలుకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గంగాప్రసాద్ మాట్లాడుతూ టీడీపీలో యువతకు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులుగా యువ మహిళలకు చంద్రబాబు అవకాశం కల్పించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అరాచక, దోపిడీ పాలలను గద్దెదింపే సమయం ఆసన్నమైందని, ఓటుతో దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాయకులు ఆకుతోట రమేష్, కామిరెడ్డి మురళీరెడ్డి, బొమ్మన పళణి, మాధవనాయుడు, సెల్వం, విజయకుమార్ నాయుడు, నీలకంఠం, జీవ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తరువాత జగన్ జైలుకే: కురుగొండ్ల



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, మార్చి 31: అవినీతి కేసుల్లో కూరుకుపోయిన సీఎం జగన్ ఎన్నికల తరువాత జైలుకు వెళ్లడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన పట్టణ పరిధిలోని 5వ వార్డు, మండల పరిధిలోని డి.ఉప్పరపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉప్పరపల్లిలో వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారు మోహన్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకొన్న జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని టీడీపీని గెలిపించాలని కోరారు. ఇక 11వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థిని కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు, నాయకులు పప్పు చంద్రమౌళిరెడ్డి, వల్లభనేని మధుసూదన్‌నాయుడు, గల్లా శ్రీనివాసులు, కాపా శ్రీనివాసులు నాయుడు, పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, శ్రీరామదాసు గంగాధర్, మల్లారం బాబు, 3వార్డు కౌన్సిలర్ పొట్టేలళ్ల ప్రభావతి, మల్లారం లక్ష్మి, చల్లా మల్లికార్జున్, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, రాధ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పార్టీల కలయికతో వైసీపీలో వణుకు: పాశం



సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

గూడూరు, మార్చి 31: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కలయికతో వైసీపీలో వణుకు మొదలైందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత తీవ్రంగా ఉందన్నారు. వైసీపీని ఇంటికి పంపడానికే ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండడానికే మూడు పార్టీలు పొత్తు పెట్టుకుని కూటమిగా పోటీ చేయడం జరుగుతోందన్నారు. గత ఎన్నికలకు ముందు ఎన్నో హామీలిచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక అన్నివర్గాలను మోసం చేశారని అన్నారు. వలంటీర్ల సేవలను టీడీపీ అడ్డుకుంటోందని తప్పుడు ప్రచారాలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4వేలు పింఛను ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, తీగల చంద్రశేఖర్, పేటేటి చంద్రసీల్, ఇంద్రల్, మనోజ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, చంద్రమౌళి, వాటంబేడు శివకుమార్, భైరప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: నెలవల



ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

ఓజిలి, మార్చి 31: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సూళ్లూరుపేట నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం చిల్లమానుచేనులో ఆదివారం ఆయన మండలంలోని పార్టీ నేతలు, ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలన, అణచివేత, దాడులు, దోపిడీలను వివరించారు. గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు టీడీపీలో చేరడంతో వారికి నెలవల పార్టీ కండువా కప్పి ఆహ్వానించాడు. ఈసందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలో ఉందని, వారు రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి టీడీపీలో చేరడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మైనారిటీ జిల్లా సెల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, యూనిట్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, ఎద్దల ధనుంజయరెడ్డి, కార్తీక్‌రాజు, అల్లాబక్షు, పురషోత్తంరాజు, ఈశ్వరరాజు, సోమశేఖర్‌రాజు, శంకర్‌రాజు, మన్మథరావు, నెలవల రాజేష్, ప్రభాకర నాయుడు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు హర్షణీయం



చంద్రబాబుతో నాగేంద్రప్రసాద్‌రెడ్డి

పెళ్లకూరు, మార్చి 31: సర్పంచులకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోండు శంకర్‌తో పాటు అనంతపురం, విజయనగరం జిల్లాల నుంచి మరో ఇద్దరు సర్పంచులకు ఎమ్మెల్యేలుగా టికెట్లు కేటాయించడంపై సంతోషకరమన్నారు. సూళ్లూరుపేటలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఆధ్యాత్మికత, సేవాభావమే రంజాన్ మాస ప్రత్యేకత



చీరలు పంపిణీ చేస్తున్న రియాజ్‌అహ్మద్

గూడూరు అర్బన్, మార్చి 31: ఆధ్యాత్మికత, సేవాభావమే రంజాన్ మాసం ప్రత్యేకత అని లయన్స్‌క్లబ్ సభ్యుడు రియాజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక దర్గా సమీపంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీక అయిన రంజాన్ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో రియాజ్‌అహ్మద్, మగ్దూం, నూర్‌అహ్మద్, షాన్‌వాజ్, ఖాన్‌బాషా, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

తడ, మార్చి 31: అక్రమంగా తరలిస్తున్న 12 మద్యం బాటిళ్లను చెక్‌పోస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద శనివారం అర్ధరాత్రి అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా నెల్లూరు వైపు వెళ్తున్న ఒక కారులో 12 బీరు బాటిళ్లు ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిని అదుపులో తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులో యువకుల ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, మార్చి 31: గంజాయి మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని బీడీ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన యువకుడిపై నాయుడుపేట పట్టణానికి చెందిన మరో యువకుడు గంజాయి మత్తులో బ్లేడ్‌తో మెడపై దాడిచేసి గాయపరిచాడు. స్థానిక యువకులు అడ్డుకుని గాయపడిన యువకుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కోటమ్మకు పూజలు

కోట, మార్చి 31: కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

ఈస్టర్‌డే ప్రార్థనలు

గూడూరు అర్బన్/కోట, మార్చి 31: గూడూరు పట్టణంలోని ఎస్‌పీఎల్‌సీ చర్చి, ప్రార్థనా మందిరం, హోసన్నమందిరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే కోట మండలంలోని కోట, విద్యానగర్, గూడలి, చిట్టేడు, తిన్నెలపూడి, నెల్లూరుపల్లి కొత్తపాళెం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పుత్తూరు వార్తలు

ఉత్తరపుకండ్రిగ సర్పంచు మృతి



బుజ్జిబాబు (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, మార్చి 31: పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపుకండ్రిగ పంచాయతీ సర్పంచు బుజ్జిబాబు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి మాజీ ఎంపీపీ డీఏన్ ఏలుమలై, తడుకు మాజీ సర్పంచు రవిశేఖర్‌రాజు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టీడీపీలో చేరిన యువత

పుత్తూరు అర్బన్, మార్చి 31: మున్సిపల్ పరిధిలోని 25, 26వ వార్డులకు సంబంధించిన యువకులు ఆదివారం నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను ఫూల్స్ చేశారని దుయ్యబట్టారు. రానున్నది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమని, చంద్రబాబునాయుడు సీఎం కాగానే మెగా డీఎస్సీని ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. టీడీపీలో చేరిన వారిలో దాసరి కార్తీక్, దాసరి గంగాధరం, పీడీ భానుకిరణ్, డీకే మోహన్, పీడీ మోహన్, ఏఎస్ తులసీ మోహన్, దాసరి వినోద్, పీఎం నీలకుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్ యుగంధర్, మాజీ వైస్ చైర్మన్ ఆనంగి ఆనంద్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, బీఆర్ మురళీకృష్ణ, బీడీ లక్ష్మీపతి, బీఎస్ హరి, శ్రీరామ్, హేమాద్రి, నవీన్, సోము, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి... అభివృద్ధి చేస్తా: భానుప్రకాష్



భానుప్రకాష్‌కు మంగళహారుతులిస్తున్న మహిళలు

వడమాలపేట, మార్చి 31: ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా, మూడు సార్లు మంత్రిగా సేవలందించిన ముద్దుకృష్ణమనాయుడు వారసుడిగా మీ ముందుకు వచ్చానని, ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన వడమాలపేటలో గ్రామకమిటీ అధ్యక్షుడు ముని ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ తన తండ్రి ముద్దుకృష్ణమనాయుడు వడమాలపేట మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి కోసం నిస్వార్థంగా కృషి చేస్తానని చెప్పారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో నిరుపేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని చెప్పారు. ప్రచారానికి వచ్చిన భానుప్రకాష్‌కు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జానా వెంకటయ్య, మణిరాజు, ధనంజయులు నాయుడు, ఢిల్లీ ప్రసాద్, లక్ష్మీప్రసన్న, సుబ్రహ్మణ్యం యాదవ్, సత్యనారాయణ, హేమావతి, రాధాకృష్ణ, జనార్ధన్, ధనలక్ష్మి, గురునాథం శెట్టి, మూర్తి, శివరాయల్, మస్తాన్, టైలర్ బాషా, శేషాద్రి, పెద్దబ్బరాజు, జగత్‌సాయి, మహేష్, మునిశేఖర్, తేజ, యుగంధర్, రాజేంద్ర, పూర్ణిమ, నీరజ, అనిత, గీత, రాజి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనారిటీల అభ్యున్నతి: ఆదిమూలం



ముస్లింలతో ఆదిమూలం

నారాయణవనం, మార్చి 31: టీడీపీతోనే మైనారిటీల అభ్యున్నతి సాధ్యమని ఆ పార్టీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. నారాయణవనంలో ఆదివారం ముస్లింల ఇఫ్తార్ విందులో ఆదిమూలం పాల్గొన్నారు. ఆయనను ముస్లింలు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ మైనారిటీల కోసం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ రద్దు చేసిందని విమర్శించారు. సత్యవేడు నియోజకవర్గంలో మైనారిటీలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తానని, రానున్న ఎన్నికల్లో తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆదిమూలం గెలవాలని మైనారిటీ నాయకుల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, మైనారిటీ నాయకులు అలియార్ సాహెబ్, ఆలీ, కలీల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

వరదయ్యపాళెం, మార్చి 31: వరదయ్యపాళెంలోని డీసీసీ బ్యాంకు సమీపంలో గల వన్నెస్ కోచింగ్ సెంటర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలియ జేశారు. డీసీసీ కోర్సును ఇస్తామని వివరించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఈ శిక్షణ తరగతులు ప్రారంభంకానున్నట్లు తెలి పారు. ఒక బ్యాచ్‌కు 10 మంది చొప్పున రోజుకు ఐదు బ్యాచ్‌లు ఉంటాయని వివరించారు. నెలరోజులు జరిగే ఈ శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9642588467, 8125466218 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

టీడీపీ నాయకుడికి ఆదిమూలం పరామర్శ



కేవీబీపురం, మార్చి 31: మండలంలోని రాజులకండ్రిగ గ్రామంలో తెలుగు దేశం సీనియర్ నాయ కుడు ముని స్వామిని, ఆయన కుమారుడు బాబును ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శించారు. ఆదివారం ఆయన వారింటికి వెళ్లారు. ఇటీవల మునిస్వామి భార్య ధనలక్ష్మి మృతిచెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు, పార్లమెంటరీ రైతు విభాగం అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, మల్లి ఖార్జునరెడ్డి, కేశవుల నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన హెలెన్



సత్యవేడు, మార్చి 31: శ్రీకాళహస్తిలో జరిగిన ప్రజాగళం కార్యక్రమానికి విచ్చేసిన టీడీపీ అధినేత చంద్ర బాబును సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డా.హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రత్యేకంగా కొద్దిసేపు ఇద్దరూ ఆయనతో మాట్లాడారు. నియోజక వర్గంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు.

హెచ్‌ఎం రాజశేఖర్ ఆదర్శనీయులు



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 31: ప్రధానోపా ధ్యాయులు రాజశేఖర్ క్రమశిక్షణలో ఆదర్శ నీయులని ఎంఈవో రవీంద్రనాథ్ కొనియా డారు. మండలంలోని నెలవాయి ఉన్నత పాఠ శాల ప్రధానోధ్యాయులు రాజేఖర్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యా యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఎంఈవో - 2 ముని సుబ్రమణ్యం, బీఎన్‌కండ్రిగ హెచ్‌ఎం రమణయ్య, ఇతర ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

టీడీపీతో గౌడ సమాజానికి మేలు

శ్రీకాళహస్తి, మార్చి 31: టీడీపీ మ్యానిఫెస్టోలోని అంశాలు హర్షణీయం అని ఆ పార్టీ తిరుపతి పార్లమెంట్ బీసీ సాధికార సమితి కన్వీనర్ తేయ జాక్షులు అన్నారు. శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో గౌడ సామాజిక వర్గం నాయకులు ఆదివారం సుధీర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తేయజాక్షులు గౌడ్ మాట్లాడుతూ టీడీపీ నూతన మ్యానిఫెస్టో గౌడ్ సామాజిక వర్గానికి మేలు చేకూరుస్తుందని తెలియజేశారు.

సీపీఎం నాయకుల అరెస్టు, విడుదల



రేణిగుంట, మార్చి 31: రేణిగుంట అర్బన్ పోలీసులు 17 మంది సీపీఎం నాయకులను అరెస్టుచేసి విడుదల చేశారు. ఆదివారం ఉదయం కరకంబాడి ఎర్రగుట్టను ఆక్రమిం చేందుకు ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా నిబంధనను పాటించనందుకు వారిపై 151 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారు.

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

కేవీబీపురం మార్చి31: మండలంలోని ఓళ్లూరు గ్రామానికి చెందిన షేక్‌బాషా(53) ఆదివారం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీ సులు అరెస్టు చేశారు. అతడి నుంచి పది సీసాల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నజీరుద్దీన్, ఏఎస్‌ఐ లోకనాథం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదల్లోకి దూసుకెళ్లిన కారు



కేవీబీపురం, మార్చి31: తమిళ నాడుకు చెందిన పర్యాటకుల కారు అదుపు తప్పి పొదల్లోకి దూసు కెళ్లింది. తమిళనాడుకు చెందిన కొందరు కారులో ఆరే సిద్ధులయ్య కోనకు పర్యటనకు వచ్చారు. ఆది వారం మధ్యాహ్నం తిరిగి వెళ్లే సమయంలో ఆరే గ్రామం వద్ద కారు అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. కారులోని వారు మద్యం సేవించి ఉన్నారని సమాచారం. వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బ్యాంక్ మేనేజర్ మృతి



మహాదేశ్ (ఫైల్‌ఫొటో)

కేవీబీపురం, మార్చి31: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు బ్యాంకు మేనేజర్ మృతిచెందాడు. తమిళనాడుకు చెందిన మహాదేశ్ (25) అక్కడి ఓ ప్రైవేటు బ్యాంకులో మేనేజర్. ఆదివారం ద్విచక్ర వాహనంలో వెళుతూ రాగిగుంట మలుపువద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని కిందపడ్డాడు. అతడికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు



శ్రీకాళహస్తి, మార్చి 31: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఆదివారం శ్రీకాళహస్తిలో పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. పట్టణం లోని చతుర్మాడ వీధులతో పాటు సినిమా వీధి, బాబు అగ్రహారం, కుమారస్వామి తిప్ప, ఆర్టీసీ బస్టాండ్, పీవీ రోడ్డు ప్రాంతాల్లో కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలని కోరారు.

అప్పంబట్టులో జేడీ ప్రచారం

పిచ్చాటూరు, మార్చి 31: పిచ్చాటూరు మండలం అప్పంబట్టులో జేడీ రాజ శేఖర్ కుటుంబ సమేతంగా ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడిగారు. తన సేవను టీడీపీ గుర్తించలేక పోయిందని, ఇండిపెండింట్‌గా గెలిచి చంద్రబా బుకు కానుకగా అందిస్తానన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నవోదయకు సాత్విక్ ఎంపిక



వరదయ్యపాళెం, మార్చి 31: మండలంలోని చిలమ త్తూరు పంచాయతీ చోళ అగ్రహారం ప్రాథమిక పాఠశాల విద్యార్థి సాత్విక్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. ఆదివారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. సాత్విక్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. సాత్విక్ అదే పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న తిరుపతి నాయుడి కుమారుడు.

నవోదయకు పూవరసి ఎంపిక



పిచ్చాటూరు, మార్చి 31: పిచ్చా టూరుకు చెందిన ఎలక్ట్రీషియన్ ఆనందన్, భారతి దంపతుల కుమార్తె పూవరసి నవోదయకు ఎంపికైంది. ఆదివారం వెలు వడిన పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధిం చింది. పూవరసిని పలువురు అభినందించారు.

9న ఉగాది కవి సమ్మేళనం

శ్రీకాళహస్తి మార్చి 31: ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఈ నెల 9వ తేదీన కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సాహితీ పురస్కార గ్రహీత లగడపాటి భాస్కర్ ఆది వారం ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి కొత్తపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠ శాలలో క్రోధి నామ సంవత్సరం సందర్భంగా సాయంత్రం నాలుగు గంటలకు సమ్మేళనం ప్రారంభమవుతుందని తెలియజేశారు. కవులు, రచయితలు సాహితీ ప్రియులు, తెలుగు భాషా అభి మానులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

అండగా ఉంటా: సుధీర్

శ్రీకాళహస్తి, మార్చి 31: శ్రీకాళహస్తి పట్టణం ఎంఎం వాడలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపీనాథ్ మేనకోడలు వైష్ణవి ఆదివారం మృతి చెందింది. బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదివారం ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆ కుటుం బాన్ని పరామర్శించారు. ఆయనవెంట పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్ ఉన్నారు.

కాపు బలిజ సంఘం ఏర్పాటు



నియామకపత్రాలు చూపుతున్న కార్యవర్గం

వరదయ్య పాళెం, మార్చి 31: వరదయ్య పాళెం మండలం కాపు, బలిజ సంఘం మండల అధ్యక్షుడిగా చక్కిరాల గురవయ్య నియమి తులయ్యారు. ఉపాధ్యక్షులుగా సిరిగం మోహన్, ప్రధాన కార్య దర్శిగా రామిరెడ్డి సతీష్ తదితరులను ఎన్ను కున్నారు. ఆదివారం స్థానిక బస్టాండు ఆవరణలో కన్వీనర్ పసుపులేటి విజయకుమార్ ఆధ్వర్యంలో మండల కమిటీ ఏర్పాటైంది.

సత్యవేడులో బీజేపీ ఎంపీ అభ్యర్థి పర్యటన



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వరప్రసాద్

సత్యవేడు, మార్చి 31: తిరుపతి పార్లమెంట్ ఎన్‌డీఏ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ సత్యవేడు మండలంలోని బీజేపీ, జనసేన నాయకులను కలిశారు. ఆదివారం బీజేపీ కార్యాలయం వద్దకు వచ్చిన ఆయనకు మాజీ ఎంపీటీసీలు వెంకటేశ్వరులరెడ్డి, మోహన్ బాబుతో కలసి మండల అధ్యక్షుడు ప్రతాప్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశులు, మండల ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నరేంద్ర, యువ మోర్చా అధ్యక్షుడు దినకర్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి దినేష్ శాలువా కప్పి సన్మానం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువ కులకు వరప్రసాద్ బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిని గెలిపించాలని కోరారు. అనంతరం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త లావణ్యకుమార్, మం డల అధ్యక్షుడు రూపేష్ కుమార్ తదితర నాయకులను కలిశారు.

బై బై...మధు

- టీడీపీలోకి వెల్లువెత్తిన వలసలు
- చంద్రబాబు సమక్షంలో భారీగా చేరికలు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న మోహన్ నాయుడు

శ్రీకాళహస్తి, మార్చి 31: శ్రీకాళహస్తిలో కరుడు గట్టిన వైసీపీ నాయకులు సైతం అనూహ్యంగా ఆ పార్టీని వీడారు. ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహి తులుగా ముద్ర పడినవారు కూడా బాయ్.. బాయ్ మధు అంటూ టీడీపీ గూటికి చేరారు. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పెద్దసంఖ్యలో వలస కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారిలో జయకృష్ణ యాదవ్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ యాదవ్, రాచగున్నేరి మాజీ సర్పంచ్ మోహన్ నాయుడు, వేంకటాద్రియాదవ్, భూపతియాదవ్, ప్రసాద్‌యాదవ్, మురళి, వెంకటేష్ గౌడ్, జగదీశ్‌గౌడ్, కోబాక ఎంపీటీసీ గౌరమ్మ, చెల్లూరు ఎంపీటీసీ రాధమ్మ, ఎండీ పుత్తూరు ఎంపీటీసీ పద్మమ్మ, చెల్లూరు సర్పంచ్ జనార్దన్, రజక ప్రెసిడెంట్ మురళి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, సురేష్, మునికుమార్, మద్దు మణి, రవి, చంద్రరాజు, ఆటో గోపి, ఎంపీటీసీ చంద్ర, రాజారెడ్డి, అంకయ్య, కృష్ణయ్య, శ్రీను, పుటం రాజా, మధు, లెనిన్, సాయి, అమర్నాథ్‌రెడ్డి, పల్లం శ్రీనివాసులు, కోటయ్య, మురగయ్యబాబ్జి, ఢిల్లీరెడ్డి, హరిరెడ్డి, గురవయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు





మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, వార్డు మెంబర్ రాజేష్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

రేణిగుంట, మార్చి 31: టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో రేణి గుంట వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. శనివారం శ్రీకాళహస్తిలో జరి గిన ప్రజాగళం కార్యక్రమం అనంతరం బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో రేణి గుంటకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ జ్యోతినారా యణ, వైసీపీ పట్టణ యువత అధ్యక్షుడు, పంచాయతీ వార్డు మెంబరు ఎంజీ.రాజేష్‌రెడ్డి, వైసీపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, వీరి అనుచరులకు చంద్రబాబు కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీ పీలో జరుగుతున్న అవమానాలను భరించలేక టీడీపీలో చేరామని వారు పేర్కొన్నారు. టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని తెలియజేశారు.

ఆపస్ నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం



ప్రమాణ స్వీకారం చేస్తున్న అపస్ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 31: తిరుపతి జిల్లా పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ఉపా ధ్యాయ సంఘం (ఆపస్) నియోజక వర్గ ఇన్‌చార్జిలుగా పలువురు నియమితులయ్యారు. శ్రీకాళహస్తిలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. తిరుపతికి దేవరాజులు, చంద్రగిరికి పట్టాభి, శ్రీకాళహస్తికి మునీంద్రబాబు, సత్యవేడుకు దాము, వెంకటగిరికి రామకృష్ణ, సూళ్లూరు పేటకు మోహన్ కృష్ణ, గూడూరుకు వెంకట ప్రసాద్‌లను ఇన్‌చార్జిలుగా నియమించారు. రాష్ట్ర సహాధ్యక్షులు చక్రపాణి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. అనం తరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన వెంకటేష్

శ్రీకాళహస్తి, మార్చి 31: రోడ్డు ప్రమాదంలో వెంకటేష్(31) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్ నగర్‌కు చెందిన వెంకటేష్ ముక్కంటి ఆలయంలో సమీపంలోని పూల దుకా ణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తుం టాడు. రాత్రి పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలు దేరాడు. రాజీవ్‌నగర్ సమీపంలోని పిచ్చాటూరు రహదారిపై వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం వచ్చింది. ఇద్దరి వాహనాలు ఢీకొన్నాయి. వెంకటేష్ గాయపడ్డాడు. మరో ద్విచక్ర వాహనదారుడు పరారయ్యాడు. స్థానికులు వెంకటేష్‌ను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

కారును ఢీకొన్న లారీ.. డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన కేశవ

ఏర్పేడు, మార్చి 31: కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆమందూరు పంచాయతీ బీసీ కాలనీకి చెందిన కేశవ తన కారులో ఇద్దరు కుమారులతో కలిసి తిరుపతికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా అంజిమేడు గ్రామం వద్ద వెనుక నుంచి ఓ లారీ ఢీకొంది. కారు వెనుకభాగం దెబ్బతింది. లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. కేశవ లారీని వెంబ డించి జంగాలపల్లి ఐసర్ వద్ద లారీకి అడ్డుగా కారు పెట్టాడు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్‌కు, కేశవకు మధ్య వాగ్వాదం జరిగింది. అయితే లారీ డ్రైవర్ కిందకు దిగ కుండా మరోసారి కారును ఢీకొని వెంకటగిరివైపు వెళ్లిపో యాడు. కేశవ తీవ్ర గాయాలపాలయ్యాడు. కుడిచేయి విరి గింది. కారులో ఉన్న ఆయన కుమారులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్డులోని ఇతర ప్రయాణికులు ఆయన్ను 108లో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



శ్రీకాళహస్తి, మార్చి 31: ఎండ తీవ్రతకు గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం శ్రీకాళ హస్తీశ్వరాలయం రెండవ గేటు సమీపంలో చోటు చేసు కుంది. గుర్తుతెలియని వృద్ధుడు ఆలయ పరిసరాల్లో యాచకుడిగా జీవనం సాగించేవాడు. ఎండ తీవ్రతతో ఆదివారం సొమ్మసిల్లి మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

టీడీపీలో వలంటీర్ చేరిక



టీడీపీలో చేరిన వలంటీర్ భాను

శ్రీకాళ హస్తి, మార్చి 31: తొట్టం బేడు గ్రామ వలం టీర్ భాను టీడీపీలో చేరారు. శనివారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాల యంలో బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధినేత చంద్రబాబు కండు వా కప్పి ఆహ్వా నించారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీరు తొలగింపు

రేణిగుంట, మార్చి 31: వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీరును తొలగిస్తూ కలెక్టర్ కార్యాలయం ఆదివారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణి కరకంబాడి పంచా యతీలోని సీఆర్‌నగర్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహిం చారు. ఇందులో వలంటీరు రాజేంద్ర పాల్గొన్నాడు. ఈ క్రమంలో అతడిని తొలగించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, మార్చి 31: ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ముక్కంటి ఆలయాన్ని దర్శించు కున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఉదయం నుంచే భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. మొత్తం రాత్రి వరకు సుమారు 27 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే : ఎమ్మెల్యే ఆదిమూలం



ఐక్యతా నినాదం చేస్తున్న ఎమ్మెల్యేలు ఆదిమూలం, వరప్రసాద్

సత్యవేడు, మార్చి 31: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని సత్యవేడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. నాగలా పురంలో ఆదివారం ఓ కల్యాణ మండపంలో మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలను నా బీసీలు, నా ఎస్సీలు అంటూనే సీఎం జగన్ నిలువునా ముంచారని విమర్శించారు. బీసీలను, దళితులను రాజకీయంగా సామాజి కంగా ఎదగనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నియోజక వర్గం లో సహజ వనరుల దోపిడీని తాను ప్రశ్నించినందుకే పెత్తందారు పెద్దిరెడ్డి కుట్రపన్ని తనకు వైసీపీలో టికెటు రానీయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. మళ్లీ వైసీపీ గెలిస్తే నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పెత్తనంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు, మేధావులు మేల్కొని పెద్దిరెడ్డి బారి నుంచి నియోజకవర్గాన్ని కాపాడు కుందామని పిలుపునిచ్చారు. ప్రజలు టీడీపీ పక్షాన నిలబడి చంద్రబాబును గెలిపించుకుందామని పిలుపు నిచ్చారు.

ప్రజాస్వామ్యంపై పెత్తందారుల పెత్తనం

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యంపై పెత్తందారుల పెత్తనంతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో ఉన్నత ఉద్యోగాలు, పదవులన్నీ రెడ్డి సామాజిక వర్గానికే కట్టబెట్టారని దుయ్యబట్టారు. జగన్ ఎస్సీలను, బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని తెలియజేశారు. మళ్లీ వైసీపీ గెలిస్తే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో, దేశంలో ఎన్‌డీఏ కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు మణికంఠ, బీజేపీ మండల అధ్యక్షుడు విజయకుమార్, నాగరాజు యాదవ్, రాజశేఖర్ యాదవ్, సురేష్ యాదవ్, చాంద్‌బాషా, బాబుసాహెబ్, భాస్కరన్, గోవిందస్వామి, పార్తీబన్, రుద్రయ్య, మురళి, మనోజ్, ఉమా, మాజీ ఎంపీపీ మురళి, సెల్వకుమార్ అన్బు, భాస్కర్‌బాబు, బాలాజీ, ఆటో బాలాజీ, రాజారామ్, సునీల్, పరశురాం, ఏఈ మండేల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

శ్రీకాళహస్తి, మార్చి 31: ఈస్టర్ వేడుకలు ఆదివారం పలు చర్చిల్లో ఘనంగా జరిగాయి. పట్టణ శివారులోని లూథరన్ చర్చిలో జరిగిన ఈస్టర్ ప్రార్థనలో ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిపాల్గొన్నారు. క్రైస్తవ మతపెద్దలు ఆయనకు ఆశీస్సులు అందించారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్ ఉన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చర్చిలలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుచ్చినాయుడుకండ్రిగ చర్చిలో పాస్టర్ జయపాల్ క్రీస్తు బోధనలు వినిపించారు. పలువురు పెద్దల సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు.





శ్రీకాళహస్తిలోని చర్చిలోని ప్రార్థనల్లో క్రైస్తవులు, బీఎన్‌కండ్రిగలో సమాదుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు